నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
1
శుక్రవారం అక్టోబర్ 11, 2024 www.navatelangana.com

నలమాద పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి నివాళులు



నవతెలంగాణ-నకిరేకల్

తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తం రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం దశదినకర్మ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వేముల రంజిత్



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వేముల రంజిత్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సుమారు పదేండ్లుగా ఆయన నల్లగొండ కోర్టులో వకీల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తన నియామకానికి సహకరించిన రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం, మాజీ జెడ్పీటీసీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

నవతెలంగాణ-నల్లగొండ

నల్లగొండ జిల్లాలో గురువారం సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి వాటిని ఒక చోట పెట్టి ఆడిపాడారు. చిన్నాపెద్ద అన్న తేడా లేకుండా మహిళలు బతుకమ్మ ఆడారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని రామాలయం వద్ద , ఎన్జీ కళాశాల గ్రౌండ్‌లో , పలుకాలనీల్లోని కూడళ్లలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు.

చండూరు : సద్దుల బతుకమ్మ సంబరాలను గురువారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. సద్దుల బతుకమ్మ పండుగతో



నల్లగొండలో..



నల్లగొండలో..

మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు



నల్లగొండలో..



చండూరులో



నకిరేకల్‌లో

గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మహిళలు తీరొక్క రకం రంగురంగుల పూలను సేకరించి బతుకమ్మ పేర్చి ప్రదర్శనగా వెళ్లి ఒకచోట చేర్చి సాంప్రదాయ బతుకమ్మ పాటలు కోలాటాలతో బతుకమ్మ సంబురాలను చేసుకున్నారు. తుకమ్మ నిమజ్జన అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న, పీఏసీఎస్ చైర్ పర్సన్ కోడి సుష్మ వెంకన్న, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మహిళా రాజకీయ నాయకురాలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని చీమలగడ్డ పద్మశాలి కాలనీలో మాజీ ఎమ్మెల్యే దైద సుందరయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మెన్ దైద రవీందర్

చెరుపల్లి సీతారాములు తల్లి లక్ష్మమ్మ మృతిపట్ల పలువురు నివాళులు



నవతెలంగాణ-చిట్యాల

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు తల్లి చెరుపల్లి లక్ష్మమ్మ మృతిచెందారు. గురువారం మండలకేంద్రంలో లక్ష్మమ్మ భౌతికకాయాన్ని ప్రముఖులు సందర్శించి జోహార్లు అర్పించారు.



చేతివృత్తిదారుల సమయన్వయ కమిటీ...

సంతాపం ప్రకటించిన వారిలో చేతి వృత్తి దారుల సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకులు. రాష్ట్ర కన్వీనర్ ఎంవి.రమణ, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.ఆశయ్య, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరింకల నర్సిహ్మ, హైదరాబాద్ అధ్యక్షులు కొప్పు పద్మ, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకట నరసయ్య, క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చెన్నారం మల్లేష్, కల్లుగీత కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు రాగిరి కృష్ణయ్య పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నల్లగొండ, యాదాద్రిభువనగిరి, సూర్యాపేట జిల్లాల నాయకత్వం చెరుపల్లి లక్ష్మమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించింది.





బీజేపీ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-నకిరేకల్

బిజెపి సభ్యత్వ నమోదు గురువారం నకిరేకల్ పట్టణంలోని 221 బూత్‌లో సభ్యత్వ నమోదు జరిగింది.ఈ సందర్భంగా నకిరేకల్ పట్టణ ఇన్చార్జి మండల వెంకన్న మాట్లాడుతూ ఆరు సంత్సరాలకోసారి వచ్చే సభ్యత్వ నమోదు ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ పట్టణ నాయకులు చినేని జాని, జిల్లా నాయకులు గర్రే మురళి మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి పందాల సైదులు, చౌగోని నాగయ్య మైల శ్రీనివాస్, కొల్లూరి జాని పాల్గొన్నారు.

నేడు నకిరేకల్‌కు మంత్రి కోమటిరెడ్డి రాక

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో గీతా కార్మికులకు కాటమయ్య రక్షక కిట్లను ఈనెల 11న పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రానున్నారు. అంతకుముందు నకిరేకల్ మున్సిపాలిటీ చైర్మెన్‌గా నూతనంగా ఎన్నికైన చెవుగొని రజిత శ్రీనివాస్ గౌడ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరు కానున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-వేములపల్లి

కారు ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని శెట్టిపాలెం సమీపంలో అద్దంకి నార్కెట్పల్లి రహదారిపై గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన సారంగి సైదులు(40) మిర్యాలగూడ నుండి శెట్టిపాలెం ఆటో నడుపుతూ అన్నపురెడ్డి గూడెం సమీపంలో యూటర్న్ తీసుకుని వెళుచుండగా హైదరాబాదు నుండి మిర్యాలగూడ వైపు వస్తున్న కారు వెనుక నుండి అతివేగంగా ఢీకొన్నది. దీంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఎస్సై వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



శుభకార్యం లో మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ- చింతపల్లి

మండలంలోని సాయి రాఘవేంద్ర ఫంక్షన్‌లో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకులు కాలేద్ కుమార్తె వివాహ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళకూ రూ.2500 ఇవ్వాలి

- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

కాంగ్రెస్ 2023 డిసెంబర్ ఎన్నికల సందర్భంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రతి మహిళకు రూ. 2500 ఇస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. గురువారం తిప్పర్తి మండల కేంద్రంలో నర్రా రాఘవరెడ్డి భవన్‌లో ఐద్వా మండల మహాసభ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసి ఉచిత ప్రయాణం, గ్యాస్ సిలిండర్ సబ్సిడీని అమలు చేయడాన్ని స్వాగతిస్తూనే ఆ పథకంలో భాగమైన ప్రతి మహిళకు రూ. 2500 నగదును అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా నేటికీ అమలు చేయలేదని తెలిపారు. వేగవంతంగా ఈ పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం కార్యచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితుల వల్ల విష జ్వరాలు వేగవంతంగా విస్తరిస్తున్నాయని, ప్రభుత్వం తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి చికెన్ గునియా, డెంగ్యూ లాంటి వ్యాధులకు అన్ని ప్రయివేటు దావఖానాల్లో ఉచిత వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రైవేటు దావకానాలు దోపిడీ విష జ్వరాల పేరుతో



విపరీతంగా దోపిడీ పెరిగిపోయిందని,అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు.ప్రభుత్వ దావకానాలో తీవ్రమైన బెడ్స్ కొరత ఉందని విష జ్వరాలపై రోజురోజుకు సమీక్ష సమావేశాలు నిర్వహించి నివారణకు కృషి చేయాలన్నారు..మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐద్వా మండల అధ్యక్షకార్యదర్శిగా బోల్లం వసంత, జంజరాల ఉమా, ఉపాధ్యక్షులు మంత్రాల మంగమ్మ, మాలే భార్గవి, సహాయ కార్యదర్శి సైదమ్మ, పోకల ఝాన్సీ, కోశాధికారిగా భీమగాని విజయలక్ష్మి, 13 మంది కమిటీ సభ్యులతో మండల కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జ్యోతి, రేణుక, దుర్గ, సైదమ్మ, లక్ష్మి, ఎల్లమ్మ, జానమ్మ, అనిత, ఈరమ్మ, పద్మా, వసంత, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

నవ తెలంగాణ-పెద్ద అడిశర్లపల్లి

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ పిలుపునిచ్చారు.గురువారం మండల కేంద్రంలో జరిగిన గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రజలను మతం పేరుతో రెచ్చగొడుతూ,దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతుందన్నారు. గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటాలు నిర్వహించాలని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకుండా సర్వేలు, ప్రజాభిప్రాయం పేరిట కాలయాపన చేస్తుందన్నారు.రైతు భరోసా నిధులను మంజూరు చేయలేదన్నారు.రాబోయే రోజులలో ప్రజా



సమస్యలపై పోరాటాలలో ముందు ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డి దేవయ్య, దానయ్య, రత్నం, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గిరిజన బిడ్డ

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్



మిర్యాలగూడ మండల పరిధిలోని జాలుబాయితండాకు చెందిన భూక్యా సేవా రాథోడ్ ఒకే ఏడాదిలో ఏకంగా ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తా చాటాడు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాలోల ఎస్ఏ తెలుగు 8వ ర్యాంకుతోపాటు ఎస్జిటీ ఉద్యోగం సాధించాడు. గతంలో గురుకుల జేఎల్ 18వ ర్యాంకు సాధించి ఏడాది కాలంలోనే ఆరు ఉద్యోగాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక గిరిజన బిడ్డ నిరుపేద కుటుంబంలో జన్మించి కష్టపడి చదివిన ఫలితానికి ఇన్ని ఉద్యోగాలు సాధించడం పట్ల పలువురు సేవాను అభినందిస్తున్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

- సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేష్

నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రజా సమస్యలపై బలమైన ప్రజా ఉద్యమాలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేష్ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, రైతు సంఘం నాయకులు అమరజీవి గొర్ల ఇంద్రా రెడ్డి మూడవ వర్ధంతి సభ మండలంలోని తడకమల్ల గ్రామంలో నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వాలు మారిన ప్రజల బతుకులు మారడం లేదని ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమస్యలు పెరిగిపోతూ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కార్యకర్తలు ఉద్యమాలు చేపట్టాలన్నారు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వాల సంస్థలను ప్రయివేటు పరం చేసి ప్రజల సంపదను ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక, రైతంగా, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ వాటిని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. దేశ సంపదను కొందరి చేతిలో పెట్టి పేద ప్రజలను మరింత ఇబ్బంది పెట్టేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. దేశ సంపదను కాపాడుకోవడంతోపాటు ప్రజా సంక్షేమం కోసం అమరవీరుల స్ఫూర్తితో భవిష్యత్తులో ఉద్యమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, చౌగాని సీతారాములు, పాదూరి గోవర్ధనా, జిల్లా నగేష్, సైదమ్మ గోవిందరెడ్డి, వెంకటరెడ్డి, జిల్లోజు శ్రీను, కుమ్మరి సైదులు, నాగుల్ హుస్సేన్, కుటుంబసభ్యులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.



సైనిక శిక్షణ ఒక ఎన్‌సీసీ కాడేట్లకు మాత్రమే లభిస్తుంది

- కల్నల్ టీఎం లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

విద్యాభ్యాసంలో ఇతర విద్యార్థులకు లభించని ప్రత్యేక సైనిక శిక్షణ ఒక్క ఎన్సిసి క్యాడేట్లకు మాత్రమే లభిస్తుందని, 31వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ టిఎం. లక్ష్మారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ అల్ఫాసెస్ పాఠశాలలో 10 రోజులుగా నడుస్తున్న ఎన్‌సీసీ క్యాంప్‌ను గురువారం సందర్శించి ఆయన మాట్లాడారు. వ్యక్తిగత క్రమశిక్షణతో పాటు, నాయకత్వ లక్షణాలు, అంకిత భావం, సామాజిక బాధ్యత జాతీయ భావాలు పెంపొందించబడతాయన్నారు. పది రోజులుగా క్యాంపులో నేర్చుకున్న విషయాలను జీవితాంతం గుర్తుపెట్టుకొని విద్యార్థులు తాము కోరుకున్న భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకోవాలని తెలిపారు. అనంతరం పది రోజులుగా క్యాంపు శిక్షణలో భాగంగా వివిధ పోటీలైన డ్రిల్, ఫైరింగ్, వ్యాసరచన ఉపన్యాస చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన పలు విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కాడెట్‌లు దేశభక్తి పాటలకు నృత్యాలను ప్రదర్శించారు. సాయంత్రం విద్యార్థులంతా ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగ ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ శశిధర్ రావు, సుబేదార్ మేజర్ ఎల్.మాధవరావు, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు ఫణీంద్ర, శీలం భద్రయ్య, ఈగల స్వరూప రెడ్డి, దంతాల సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్ పర్సన్ రజితకు సన్మానం

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ మున్సిపల్ చైర్ పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్‌గౌడ్‌ను గురువారం పట్టణంలోని మార్కెట్ రోడ్డులో భవాని నగర్ కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ తొమ్మిదవ వార్డు అభివృద్ధితో పాటు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీలో నెలకొని ఉన్న డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో భవాని నగర్ కాలనీ గౌరవాధ్యక్షుడు ఎర్ర శంభు లింగారెడ్డి, వీరమల్ల రవీందర్, అధ్యక్షుడు ముత్యాల భిక్షం, కార్యదర్శి సిరికొండ బిక్షం, కోశాధికారి సోమ వెంకటరెడ్డి, ప్రతినిధులు కందాల భద్రారెడ్డి, రాపోలు సుదర్శన్, సారెడ్డి కృష్ణారెడ్డి, బి. వెంకన్న కె. వెంకన్న, సుధాకర్ రెడ్డి, వెంకటరమణ, మహిళలు పాల్గొన్నారు.



తహసీల్దారు పోలీసు కస్టడీకి అనుమతించిన కోర్టు

నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సమయంలో తహసీల్దార్ జయశ్రీ ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా బదిలీ చేసి అట్టి భూములపై వచ్చిన రైతుబంధు నిధులను స్వాహా చేశారని ఆరోపణలతో బుధవారం హుజూర్నగర్ కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ కోర్టు విధించింది. కాగా గురువారం హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు తమ దర్యాప్తులో భాగంగా ఆమె నుండి మరింత సమాచారం రాబట్టడనికి ఐదు రోజుల పోలీస్ కస్టడికి అనుమతించాలని గురువారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జయశ్రీ న్యాయవాది ఆమెకు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ శుక్రవారం ఉదయం 8:30 నుండి సాయంత్రం 5:30 వరకు విచారించడానికి పోలీసులకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారు. శుక్ర శని ఆది న్యాయస్థానాలకు సెలవు దినాలు కావడంతో జయశ్రీ బెయిల్ మంజూరు కోసం దాఖలు చేసిన పిటిషన్ను సోమవారానికి వాయిదా వేశారు.

సంస్కృతీ, సాంప్రదాయాలకు నిదర్శనం పండుగలు

● సీఐ చరమంద రాజు



నవతెలంగాణ-హుజూర్‌నగర్

పండుగలు మన సాంస్కృతి సాంప్రదాయాలకు నిలయమని హుజూర్నగర్ సీఐ చరమంద రాజు అన్నారు గురువారం స్థానిక కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు ప్రజలంతా కలిసికట్టుగా ఐకమత్యంగా ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు అన్ని దానాల్లో అన్నదానం గొప్పది అన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమాలు కనకదుర్గ సేవా సమాజం నిర్వాహకులు బాచి మంచి కొండయ్య వాచి మంచి చంద్రం ఐదో వార్డ్ కౌన్సిలర్ గుండా పని కుమారి కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్యాల అమర్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ కమ్యూనిస్టు పార్టీ

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగర్జున రెడ్డి



నవతెలంగాణ-చిలుకూరు

ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగర్జున రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మాధవగూడెం గ్రామంలో ఆ పార్టీ మండల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా కమ్యూనిస్టు పార్టీ కొనసాగుతున్నదన్నారు. గ్రామస్థాయి నుండి ప్రపంచ దేశాల వరకు కమ్యూనిస్టు పార్టీ యొక్క గొప్పతనం సిద్ధాంతాలు నైతిక విలువలు ప్రపంచ దేశాలలో కమ్యూనిస్టు పార్టీ విలువలు పెరిగాయి అన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలో ఏ ఒక్క గ్రామానికి కూడా ప్రభుత్వ బస్సులు నడవడం లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కోల్పోతున్నారన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ప్రజా వైద్య ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలన్నారు. మండల వ్యాప్తంగా వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. అమలు కాని హామీలతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్క పథకం కూడా పూర్తిగా అమలు చేయలేక పోయిందన్నారు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నియంత పరిపాలన కొనసాగిస్తుందన్నారు ప్రాంతీయ పార్టీలతో అధికారం కొనసాగిస్తుందన్నారు. రానున్న రోజులలో అన్ని రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీల అధికారం కొనసాగిస్తాయన్నారు. సీపీఐ(ఎం) చిలుకూరు మండల కార్యదర్శిగా నాగాటి రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు వేనేపల్లి వెంకటేశ్వరరావు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం సీపీఐ(ఎం) అమరవీరుల ఆశయాలకు జోహార్లు అర్పించారు. సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు బుడిగం రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జే నరసింహారావు దేవరం వెంకటరెడ్డి మిట్టగనపుల ముత్యాలు బత్తిని అలివేలు వెంకటయ్య నారసాని వెంకటేశ్వర్లు గద్దపాటి కిరణ్ యదాల వీరస్వామి భాష్యం లింగ మల్లయ్య పిల్లి వీరమల్లు గట్టు లింగయ్య మాదాసు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండాలి

● ముస్తాబైన బతుకమ్మ తో సునీత జగదీశ్ రెడ్డి దంపతులు
● ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు
● మాజీమంత్రి జగదీశ్ రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండాలని.. భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజుల పాటు చేసే పూజలు ఫలించి భక్తులు కోరిన కోర్కెలు నెరవేరాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పెద్ద ఎత్తున మహిళతో కలిసి సునీత జగదీశ్ రెడ్డి, సోదరిమణి కట్ట రేణుకశేఖర్ రెడ్డి లు పేర్చిన బతుకమ్మలను ఆయన సందర్శించి మాట్లాడారు. తీరొక్క పూలతో జరుపుకునే సద్దుల బతుకమ్మ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. అడపడుచులందరికి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ప్రారంభమైన సద్దుల బతుకమ్మ సంబరాలు సందడిగా కొనసాగాయి. మహిళ కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యురాళ్లు, ఈ సందర్భంగా ఫోటోలు దిగి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉప్పల లలిత ఆనంద్, కౌన్సిలర్లు నిమ్మల స్రవంతి, కవిత, సుధారాణి, బత్తుల లక్ష్మీ జానీ, కొండపల్లి భద్రమ్మ, సల్మా కరుణశ్రీ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాబాది వెంకట్ రెడ్డి మృతి

సంతాపం తెలిపిన ఎమ్మెల్యే సామెల్

నవతెలంగాణ-నూతనకల్

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాబాది వెంకట్‌రెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. తుంగతుర్తి శాసనసభ సభ్యులు మందుల సామెల్ మృతుని మృతదేహంపై కాంగ్రెస్ జెండా కప్పి పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించాడు. మృతుని కుటుంబానికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ తీగల గిరిధర్ రెడ్డి జిల్లా నాయకులు కట్ట మల్లారెడ్డి బొడ్డుపల్లి అంజయ్య పన్నాల మల్లారెడ్డి, సైరెడ్డి సుధీర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది

నవతెలంగాణ-నాగారం

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదానమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పసుపులేటి ప్రేమలతవెంకట్‌రెడ్డి అన్నారు. దేవిశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాత వద్ద గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని కలిగి ఉండాలన్నారు. అనంతరం కనకదుర్గా మాత విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి సుమారు 800 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయంలో చండీహోమం

బంగారు కళ్ళు, ముక్కు పుడక సమర్పణ

నవతెలంగాణ-పెన్‌పహాడ్


దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండలపాల వద్ద ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని లింగాల కనకదుర్గ దేవాలయంలో ఆలయ చైర్మెన్ కేసిరెడ్డి కోటిరెడ్డి ఆధ్వర్యంలో దుర్గామాత అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారి వద్ద వేద పండితులు ఇరువంటి సత్యనారాయణ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకరి సురేష్-మౌనిక దంపతులు రూ.16 వేల విలువగల అమ్మవారి బంగారు కళ్ల సమర్పించారు. వెన్న జగదీష్ రెడ్డి-నవ్య దంపతులు రూ.15వేల విలువగల బంగారు ముక్కుపుడక గురువారం సమర్పించారు. అంతకుముందు ఆలయంలో మాలధారణ స్వాములతో వైభవంగా చండీహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మెన్ నల్లపు వెంకటేశ్వర్లు, కార్యదర్శి మామిడి అరవింద్, సలహాదారులు మామిడి శ్రీనివాస్, కోశాధికారి ఏసురాజు, దుర్గయ్య, మాలధార స్వా ములు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రపంచ మానసిక దినోత్సవము

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మానసిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వైద్య నిపుణురాలు డా స్రవంతి మానసిక వ్యాధిగ్రస్తులతో మాట్లాడి, మానసిక అనారోగ్యం పెద్ద జబ్బు కాదని, దానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సరైన చికిత్స తీసుకోవడం ద్వారా నయంచేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో మండల వైద్యాధికారి కె స్రవంతి, హెచ్ఈఓ చంద్రశేఖర్ రాజు, ఎంపీహెచ్ఎస్ జానకమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, స్టాఫ్‌నర్స్‌లు చంద్రలీల, సుజాత, ఏఎన్ఎంలు దుర్గాభవాని, నాగలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) అప్పన్నపేట గ్రామ శాఖలు ఎన్నిక



నవతెలంగాణ-గరిడేపల్లి

మండల పరిధిలో అప్పన్నపేట గ్రామశాఖ కార్యదర్శిగా ఎస్‌కే నాగులు మీరాను ఎన్నుకున్నారు. సీపీఐ(ఎం) మహాసభలో పార్టీ మండల కార్యదర్శి ఎస్‌కే యాకూబ్ మాట్లాడుతూ నూతన గ్రామ కార్యదర్శిగా ఎన్నికైన మండల కమిటీ తరుపున శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యం ప్రజల మధ్యన ఉండే వ్యక్తి గాదరి కిషోర్ కుమార్

నవతెలంగాణ-తుంగతుర్తి

ప్రజల మధ్య ఉండి,ప్రజల సమస్యల పరిష్కారం కోసం,పరితపించే వ్యక్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ అని టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య అన్నారు.గురువారం మండల పరిధిలోని మంచతండా గ్రామపంచాయతీ ఆవాసం సీతారాం తండాలో మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను ప్రారంభించి మాట్లాడారు.ఈ మేరకు మాజీ ఎమ్మెల్యేకు పదవులు ముఖ్యం కాదని తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయమని గెలిచిన ఓడిన ప్రజల మధ్య ఉంటాడని అన్నారు.ఈ కార్యక్రమంలో మంచతండ మాజీ సర్పంచ్ శారద మాన్సింగ్ గ్రామ శాఖ అధ్యక్షులు లకావత్ రాములు నాయక్ గ్రామ ప్రజలు బిక్షం, రవి, గణేష్, నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సామేల్‌పై సీనియర్ల అసంతృప్తి

● బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం
● సీనియర్లకు గుర్తింపు కోసం పోరాటం
● సామెల్ తీరుతో దామన్న వర్గ్యుల ఆక్రోశం, పాత నాయకుల పట్ల అసమ్మతి
● కాంగ్రెస్‌లో పెరుగుతున్న విభేధాలు
● తుంగతుర్తి కాంగ్రెస్ భవిష్యత్తు సవాళ్లు



నవతెలంగాణ-సూర్యాపేట

తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో తాజాగా విబేధాలు భగ్గుమన్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ నాయకత్వంపై స్థానిక సీనియర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రత్యేకంగా పలు మార్లు రహస్యంగా సమావేశమై సామెల్ పట్ల తమ అభ్యంతరాలు వ్యక్తపరిచారు.సీనియర్ల ఆరోపణల ప్రకారం.. మందుల సామెల్ నియోజకవర్గంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పార్టీ కార్యకర్తలకు సహకారం అందించడంలో విఫలమయ్యారనేది ప్రధాన విమర్శ. ఎన్నికల్లో పార్టీకి ఎంతగానో సేవ చేసిన నాయకులు సామెల్ వైఖరిని తప్పుబడుతున్నారు. నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల మధ్య విభజనలు పెరిగిపోతున్నాయనే ఆందోళనని వారు వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ మార్క్ రాజకీయానికి కేరాఫ్‌గా మారింది! దగ్గరుండి ఆయన్ని ఎమ్మెల్యేగా గెలిపిస్తే తగిన శాస్తే తమకు జరిగిందని ఒక బ్యాచ్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. వలస వచ్చిన వారికే ప్రియారిటీ ఇస్తున్నారని....పాత వాళ్లను పాతరేశారని భగ్గున మండుతున్నారు.

తుంగతుర్తి కాంగ్రెస్‌లో గ్రూప్ పాలిటిక్స్ పరాకాష్టకు చేరాయి. ఎందాకా అంటే సొంతపార్టీ నేతలనే పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కించేంత వరకు! కొంతకాలంగా నివురుగప్పిన నిప్పులా ఉన్న కేడర్ ఒక్కసారిగా రోడ్డెక్కింది. దీనిక్కారణం ఎమ్మెల్యే మందుల సామేలే అని సీనియర్ల వర్గం బలంగా వాదిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల టైంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సామేల్‌కు....ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నేతలు తుంగతుర్తి నియోజకవర్గం కేడర్ రెడ్ కార్పెట్ పరిచిన మాట వాస్తవమే. టికెట్ దగ్గర్నుంచి ప్రచారం, ఆర్థిక సహాయం, ఇలా అన్నీ తామై ముందుకు నడిపించామని నియోజకవర్గంలోని కాంగ్రెస్ నేతలు చెబుతున్న విషయం తెల్సిందే. తీరా గెలిచిన తర్వాత సాయం చేసిన కాంగ్రెస్ లీడర్లను కాదని బీఆర్ఎస్ నుంచి వచ్చిన నేతలను చేరదీశారని ఎమ్మెల్యే వాళ్ల పక్షాన్నే ఉంటున్నారని కొందరు కాంగ్రెస్ నేతలు కొంతకాలంగా లోలోపల మథనపడ్డారు. పదేళ్ల పార్టీకి అండగా నిలబడిన నేతలను పూచికపుల్లలాగా తీసి పడేశారని పార్టీ అధికారంలో ఉన్నా ప్రాధాన్యత లేకుండా పోయిందని కేడర్ గుర్రుమీదుంది. దీనికి తోడు పార్టీ కార్యకలాపాల్లో, అధికారిక వ్యవహారాల్లో ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల జోక్యం మితిమీరి పోయిందనే అభిప్రాయం కూడా పార్టీలో వ్యక్తమవుతోంది.దశాబ్దం పాటు ప్రతిపక్షంలో ఉండి పార్టీ కోసం నిలబడితే, అండగా ఉన్న నేతలను పక్కనపెట్టి తను అనుకున్న వాళ్లతో నియోజకవర్గంలో అన్ని వ్యవహారాలు చక్కబెట్టడం కూడా లోకల్ లీడర్ల ఆగ్రహానికి కారణంగా మారింది. ఈ వ్యవహారం ముదిరి పాకాన పడేసరికి తుంగతుర్తి కాంగ్రెస్ పాత కేడర్ బరస్టయింది.ఈ నేపథ్యంలో ఇటీవలే దగా పడిన కాంగ్రెస్ నేతల్లారా కదలిరండి అంటూ ప్రత్యేక సమావేశానికి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానంద చారి పిలుపునిచ్చిన విషయం తెల్సిందే. అయితే ఈ మీటింగ్‌కి పోలీసులు పర్మిషన్ ఇవ్వలేదు. అయినప్పటికీ వాళ్లు సమావేశం పెట్టాలనే తీర్మానించుకున్నారు. పోలీసులు ససేమిరా అన్నారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. అరెస్టుల వరకు వెళ్లింది. స్టేషన్ ముందు ధర్నా జరిగింది. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మందుల సామేలు ఆదేశాల ప్రకారమే అరెస్టులు జరిగాయని.... సొంతపార్టీ నేతలనే పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కించారని సీనియర్ కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇంత దారుణం లేదని.. సొంతపార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇలా విడిపోవాల్సి వచ్చిందని ఆ గ్రూపు నేతలు చర్చించుకుంటున్నారు. పార్టీలో పొలిటికల్ సీనియర్లకు తగిన గౌరవం ఇవ్వకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలుస్తోంది. సామెల్ స్థానిక రాజకీయాల్లో కొంతకాలంగా నియోజకవర్గంలో తమను పూర్తిగా పక్కన పెట్టి, కొత్తగా పార్టీలో చేరిన వారికి పెద్ద బాధ్యతలు అప్పగిస్తున్నారని వాదిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో చాలా కాలం పనిచేసిన నేతలు, కార్యకర్తలు తమకు దక్కాల్సిన గుర్తింపు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ పరిస్థితులు తుంగతుర్తి కాంగ్రెస్‌లో విభేదాలు మరింత ముదరించాయి.

దామోదర్ రెడ్డి గ్రూపువారు అసంతృప్తి...

తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ వైఖరిపై అసంతృప్తి పెరుగుతున్న సమయంలో, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి వర్గీయులు ఆయన తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దామోదర్ రెడ్డి గతంలో ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమైన నేతగా ఉన్నారు. కాంగ్రెస్‌కి, క్యాడర్‌కు ఆయన అన్ని రకాలుగా అండదండలుగా ఉంటూ పార్టీని నిలబెట్టుకుంటూ వచ్చారు. కొన్నేండ్లుగా నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా ఉన్న దామన్న కూడా సామేల్ వ్యవహార శైలి పై మండిపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గత కొన్ని దశాబ్దాలుగా దామన్న తో కలిసి నడిచిన ఆయన అనుచరులు ఇప్పుడు సామేల్ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సామెల్ నడత, తన నిర్ణయాల్లో సీనియర్ నాయకులను పక్కన పెట్టి, కొత్తగా పార్టీలో చేరిన వారిని ప్రాధాన్యం ఇవ్వడంపై దామోదర్ రెడ్డి గ్రూపువారు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. దామోదర్ రెడ్డి గ్రూపు నాయకులు, నియోజకవర్గంలో సామేల్ నేతృత్వంలో పనిచేయడం కష్టమని, స్థానికంగా పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న ప్రయత్నాలు సంతృప్తికరంగా లేవని అంటున్నారు. దామోదర్ రెడ్డి వర్గీయుల అభిప్రాయం ప్రకారం, సీనియర్ నాయకులను పక్కనబెట్టి, కొత్త నాయకులకు పెత్తనం ఇచ్చి, నియోజకవర్గ రాజకీయాలను తారుమారు చేయడం, పార్టీ సీనియర్లను అవమానించడం అనే అంశాలు ప్రధానంగా ఉన్నాయి. ఈ పరిణామాలు, నియోజకవర్గంలో పార్టీలో విభజనలు పెరగడానికి కారణమవుతున్నాయని ఈ వర్గం చెబుతోంది.

ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం...సీనియర్ల అసంతృప్తి...

సీనియర్ కాంగ్రెస్ నాయకులు గతంలో పార్టీలో ఉన్న సుదీర్ఘ అనుభవం, కృషి, కార్యకలాపాలపై మద్దతు లేకుండా, సామేల్ వారి సూచనలు, మార్గదర్శకాలను పక్కనబెట్టారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి అభిప్రాయాల్ని పట్టించుకోకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన కొత్త వారిని ముందుకు తీసుకురావడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు . ఇది పార్టీకి పూర్తిగా విఘాతం కలిగించేందుకు దారితీస్తుందని సీనియర్లు అంటున్నారు. ఇతర పార్టీల నాయకులను ప్రోత్సహించడంపై అసహనం వ్యక్తం చేస్తుండటం, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో చీలికలు తెచ్చే ప్రమాదం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాబట్టి రాష్ట్ర స్థాయి నాయకత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని, త్వరలోనే జోక్యం చేసుకోవాలని, ఈ వివాదాలను పరిష్కరించాలని సీనియర్లు డిమాండ్ చేస్తున్నారు.సమీప ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన వారు ఇప్పుడు సామెల్ సన్నిహితులుగా, ముఖ్యమైన పదవుల్లో కొనసాగుతున్నారని, నియోజకవర్గంలో వారికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతోందని సీనియర్లు మండిపడుతున్నారు. పార్టీకి కొత్తగా వచ్చిన వారిని అధికారపరమైన అవకాశాలు కల్పించడం వల్ల సీనియర్లు పూర్తిగా కోణంలోకి రావడం లేదని, దీని వల్లనే నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం బలహీన పడుతుందని వాదిస్తున్నారు.

అధిష్టానం జోక్యం అవసరం...

ఈ పరిణామాల నేపథ్యంలో, తుంగతుర్తి కాంగ్రెస్‌లో సీనియర్ నాయకులు తమ అభ్యంతరాలను స్పష్టంగా వ్యక్తం చేశారు. ఎంపికల్లో, నియామకాలలో పార్టీ సీనియర్లకు గుర్తింపు లేకపోవడం, నాయకత్వంలో మౌలిక మార్పులు జరగడంపై తమ అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం జోక్యం చేసుకుని, ఈ విభేదాలను పరిష్కరించాలని, సీనియర్ నాయకులకు అవసరమైన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి నాయకత్వం తక్షణమే జోక్యం చేసుకోకపోతే, తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి రాబోయే కాలంలో పెద్ద ప్రమాదం ఎదురుకావచ్చని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

ధన్యురాలు చెరుపల్లి లక్ష్మమ్మ

● సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

చెరుపల్లి లక్ష్మమ్మ ధన్యురాలని సిపిఐఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. సిపిఐఎం కేంద్ర కమిటీ సభ్యులు చేరుపల్లి సీతారాములు తల్లి చెరుపల్లి లక్ష్మమ్మ (97)మరణించిన సందర్భంగా గురువారం చిట్యాలలో ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి జిల్లా కమిటీ నుండి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాట కాలం నుండి 97 ఏండ్ల వయసులో చనిపోయేంతా వరకు కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు పట్ల అత్యంత విశ్వాసం కలిగి ఉన్నారని కొనియాడారు. తన రెండవ కుమారుడైన చేరుపల్లి సీతారాములును సీపీఐ(ఎం)కి పూర్తి కాలం కార్యకర్తగా 50 ఏండ్ల క్రితమే పంపి అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించే అవకాశం కల్పించిన తల్లి లక్ష్మమ్మ అని ఆయన పేర్కొన్నారు.ఆమె ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు అంకిత భావంతో పని చేయాలని కోరారు.లక్ష్మమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం ప్రకటించిన వారిలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అధ్యక్షుడు రమణ, తదితరులు ఉన్నారు.

తెలంగాణ వాకిళ్లు.. పూలలోగిల్లు

● పువ్వులనే దేవతగా పూజించే సంప్రదాయం తెలంగాణ రాష్ట్రం యొక్క ప్రత్యేకత
● జోరు వానలో తడుచుకుంటూ సద్దుల బతుకమ్మతో మహిళలు చిన్నారులు



నవతెలంగాణ-తుంగతుర్తి

తెలంగాణ వాకిళ్ల పూలలోగిళ్లుగా మారాయి. గురువారం సద్దుల బతుకమ్మను మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. ఎక్కడైనా దేవతలను పువ్వులతో పూజిస్తారు, కానీ పువ్వులనే దేవతలుగా పూజించే సంప్రదాయం తెలంగాణ రాష్ట్రం యొక్క ప్రత్యేకత. ఇంద్ర ధనస్సులోని వర్ణాలు కలిగిన రకరకాల (గునుగు, టేకు, తంగేడు, తామర, బటాని పూలు, బంతి, సీతజడ, చామంతి, గులాబి, మందార) పూలతో అలంకరించిన బతుకమ్మ ఇవాళ జగమేలుతోంది. తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ పండుగ నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. తెలంగాణ సంప్రదాయన్ని విదేశాల్లోనూ పాటిస్తున్నారు. అక్కడ స్థిరపడ్డ మనోళ్లంతా బతుకమ్మ పండగ అంగరంగా వైభవంగా జరుపుకుంటున్నారు.

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ. ఏమేమి కాయప్పునే గౌరమ్మ అంటూ ఒకసారి..

చిత్తూ చిత్తుల బొమ్మ శివుడి ముద్దుల గుమ్మ..
ఒక్కేసి పువ్వేసి సందమామ..
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో మమ్మేలు కోవమ్మ ఉయ్యాలో..

ఇలా బతుకమ్మ పాటలతో ఆ ప్రాంతాలు మారుమోగుతున్నాయి బతుకమ్మ సంబురాలు చివర రోజుకు ఘనంగా నిర్వహించారు. తొలిరోజు (అక్టోబర్2) ఎంగిలిపూల బతుకమ్మతో సంబురాలు మొదలయ్యాయి. అప్పటి నుంచి ప్రతీరోజు ఒక్కో పేరుతో బతుకమ్మను పేర్చుతూ నైవేద్యాలు సమర్పి ంచారు వంవి ా ళలు. అలా గే బతుకమ్మ చుట్టూ తిరిగి ఆడి పాడారు. ఆపై బతుకమ్మను నిమజ్జనాలు చేయడం నైవేద్యాల పంపకం,వాయినాలు ఇచ్చిపుచ్చుకోవడం జరిగింది. ఇక చివరి రోజు సద్దుల బతుకమ్మ అని పిలుచుకుంటారు. ముందు ఎనిమిది రోజుల బతుకమ్మ వేడుకల కంటే సద్దుల బతుకమ్మను ఎంతో విశేషంగా జరుపుకుంటారు. చాలా పెద్ద పెద్ద బతుకమ్మలను పేరుస్తారు. అలాగే పసుపుతో తయారు చేసిన గౌరమ్మను బతుకమ్మ వద్ద ఉంచుతారు.ఈరోజు పలు రకాల నైవేద్యాలను సమర్పిస్తారు. ఆశ్వయుజ అష్టమి నాడు సద్దుల బతుకమ్మను జరుపుకుంటారు.తొమ్మిది రోజుల పాటు జరుపుకునే ఈ పండుగలో చివరి రోజు ఎంతో విశిష్టమైంది. ఈ సందర్భంగా పలువురు మహిళలు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

పురుషోత్తం రెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-హుజూర్‌నగర్

భారీ నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాల ఉత్తంకుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డి ఇటీవల చనిపోయారు. గురువారం ఆయన దశదినకర్మ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి సమ్మెట సుబ్బరాజు టీపీసీసీ జాయింట్ సెక్రెటరీ ఎండి అజీజ్ పాషా, మాజీ సర్పంచ్ గొట్టే వెంకట్రామయ్య, ఎంఏ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం

నవతెలంగాణ-హుజూర్‌నగర్ రూరల్



హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామంలోని శాంతి విద్యానికేతన్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ పాఠశాలలో 2012-13 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు గురువారం ఆ పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల రోజుల్లో గడిపిన మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలోని మెరుగైన విద్యాబోధన వలనే నేడు వివిధ రంగాల్లో స్థిరపడ్డామని అభిప్రాయపడ్డారు. నేటి విద్యావిధానంలో అనేక మార్పులు వచ్చాయనీ, నేటి విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలై చదువుపట్ల అశ్రద్ధ చేస్తున్నారని, ఇది చదువుపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఇది భవిష్యత్‌లో అనేక ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలంటే క్రమశిక్షణతో కూడిన విద్యావిధానం అవసరమని వారు అభిప్రాయపడ్డారు. అనంతరం ఆటపాటలతో సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు ఉద్దోజు శ్రీనివాసచారి, ఉపాధ్యాయులు కే జ్యోతి, ఇ. చిరంజీవి, వెంకటేశ్వర్లు , జి శ్రీనివాస్, వీరబ్రహ్మం , సత్యనారాయణ రాజు, కె నిర్మల, ఎస్ కే తాజొద్దీన్ సహా పూర్వ విద్యార్థులు క్రాంతి కుమార్, వేణు, నవ్య, భవాని, కే భార్గవి, నరసింహారెడ్డి, భాష తదితరులు పాల్గొన్నారు.

జాతిపిత విగ్రహానికి రంగులు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండల పరిధిలోని చీదేళ్ల గ్రామంలో 1949లో నిర్మించి ప్రారంభించిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి రంగులు పోయి వెలవెల పోతుండటంతో దాన్ని చూసి చలించిపోయిన అదే గ్రామానికి ఉపాధ్యాయ దంపతులు పరెడ్డి శోభ వీరారెడ్డిలు రంగులు వేయించి మాజీ ఎంపీటీసీ జూలకంటి వెంకటరెడ్డి చేతుల మీదుగా గురువారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగులు వేపించిన ఉపాధ్యాయ దంపతులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ వైస్ చైర్మెన్ వరికల్లు శ్రీనివాస్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబు, మాజీ సింగిల్ సైదులు, యర్రమళ్ళ వెంకటయ్య కామల్ల వీరయ్య, వెన్న సైదిరెడ్డి, నూతన ఉపాధ్యాయులు సాయి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
శుక్రవారం | అక్టోబర్ 11, 2024 | www.navatelangana.com

నేడు గీత కార్మికులకు రక్షక కిట్లు

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి

నవతెలంగాణ-రామన్నపేట

గీత వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న గౌడ సోదరులకు కాటమయ్య రక్షక కిట్లను ఈ నెల 11న ఉదయం 9:30 గంటలకు నకిరేకల్ పట్టణంలోని హైస్కూల్ ఆవరణలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం నువ్వు హాజరు కావునందున గౌడ కుల సోదరులందరూ, మండల ప్రజా ప్రతినిధులు నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పురుషోత్తమ్‌రెడ్డి దశదిన కర్మలో పాల్గొన్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-యాదగిరిగుట్ట రూరల్



ఇటీవల కాలం చేసిన భారీనీటిపారుదల శాఖా మాత్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తమ్ రెడ్డి దశదిన కర్మలో రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పంట రుణాల కోసం పడిగాపులు !


- కాలయాపన చేస్తున్న బ్యాంకర్లు
- ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్న రైతులు
- 40 శాతం మందికే రుణమాఫీ
- సాంకేతిక కారణాల సాకుతో 60శాతం మందికి అందని రుణమాఫీ



నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

పంట రుణాల కోసం రైతులు బ్యాంకుల వద్ద పడికాపులు కాస్తున్నారు. బ్యాంకు మేనేజర్లు మాత్రం గత నెల రోజులుగా రేపు మాకు అంటూ కాలయాపన చేస్తున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పింది. అందుకు రూ.31 వేల కోట్లు అవసరమని చెప్పిన ప్రభుత్వం రూ.18 వేల కోట్లు మాత్రమే విడుదల చేసింది. జులై 18న రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించిన ప్రభుత్వం ఆగస్టు 15 నుండి రూ.2లక్షల రుణమాఫీ ప్రక్రియను మొదలు పెట్టింది. 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ పథకం వర్తించిందని మిగిలిన 60 శాతం మంది రైతులకు వివిధ సాంకేతిక కారణాలను సాకు చూపించి రుణమాఫీ వర్తింప చేయలేదని రైతుల ఆవేదన చెందుతున్నారు. రుణమాఫీ అయినా ధరణి వెబ్ సైట్‌లో తమ పేరున రుణం ఉన్నట్టు చూపిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మూడు విడుదల కింద 3,523 మంది రైతులకు సంబంధించి రూ.29,81,954 మాత్రమే రుణమాఫీ వచ్చింది. ఇంకా 60 శాతం మంది రైతులకు ప్రభుత్వ రుణమాఫీ రాలేదు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు, తెల్ల రేషన్ కార్డు లేని వారు, వివిధ సాంకేతిక లోపాలు, రూ.2లక్షలకు పైన రుణాలు ఉన్నవారు ఉన్నారు. వడ్డీతో కలుపుకొని రూ.2లక్షలకు పైన అప్పు ఉన్న రైతులు పై డబ్బులు చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుందని ఇటు బ్యాంకర్లు అటు వ్యవసాయ అధికారులు చెప్పడంతో రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి బ్యాంకులకు చెల్లించారు. సుమారు 1000 మంది రైతులు తాము ప్రభుత్వ రుణమాఫీకి అర్హులమేనని గ్రీవెన్స్‌లో దరఖాస్తులు చేసుకుని ఫోటోలు సైతం దిగారు. ఈ వెయ్యి మందికి రుణమాఫీ వస్తుందా? రాదా? తెలియని పరిస్థితి. ధరణి వెబ్ సైట్ రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు అందకపోను ఇటు బ్యాంకు వడ్డీలు అటు ప్రైవేటు వడ్డీలు తడిసి మోపెడు అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన రైతులకు వెంటనే రూ.2లక్షల రుణమాఫీ వర్తింపచేయాలని, కొత్త రుణాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

బయట వడ్డీకి తెచ్చి బ్యాంకుకు కట్టిన: తుమ్మల శ్రీనివాసరెడ్డి (రైతు శేరిగూడెం)



నారాయణపురం ఏపీజీవీబీ బ్యాంకులో రూ.2లక్షలు అప్పు తీసుకున్న వడ్డీతో కలిపి రూ.3.50 లక్షలు అయింది. రూ1.50 లక్షలు చెల్లిస్తేనే రూ.2లక్షల రుణమాఫీ వర్తిస్తుందని చెప్పడంతో ప్రయివేటు వడ్డీ వ్యాపారి వద్ద రూ.2.50 వడ్డీ చొప్పున అప్పుకు తెచ్చి బ్యాంకులో కట్టి మూడు నెలలు కావొస్తుంది. తిరిగి కొత్త రుణం రాలేదు. ప్రతిరోజు బ్యాంకు చుట్టూ తిరుగుతున్న మేనేజర్ రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇటు బ్యాంకులో ఉన్న రూ.2లక్షలకు, బయట తెచ్చిన లక్షన్నరకు వడ్డీ పెరుగుతుంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. వెంటనే రుణం ఇప్పించాలి.

వెబ్సైట్ ప్రాబ్లం వల్ల ఆలస్యం అవుతోంది: బ్యాంకు మేనేజర్ (ఏపీజీవీబీ నారాయణపురం)

వెబ్ సైట్ ప్రాబ్లం వల్ల కొత్త రుణాల మంజూరులో ఆలస్యం జరుగుతోంది. వారం రోజుల్లో సమస్యను అధిగమించి కొత్తగా పంట రుణాలు అందజేస్తాం. రుణమాఫీ వర్తించిన వాళ్లందరికీ రెన్యువల్ చేసాం.

ఇష్టంతో పనిచేస్తే.. మానసిక ఒత్తిడి దూరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు



నవతెలంగాణ-భువనగిరి

తాము నిర్వహించే పనులను ఇష్టంతో బాధ్యతతో పూర్తి అవగాహనతో నిర్వహిస్తే మానసిక ఒత్తిడి ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు తెలిపారు. గురువారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనిలో నిబద్ధత కొరవడినా లేదా అధికంగా ఉహించుకొని భయానికి గురైతే మానసిక అనారోగ్యముతో జీవితములో చాలా కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఆశలు సాధించుకొనే పరిమితులకు లోబడి ఉంటె వాటిని మానసిక ఒత్తిడి లేకుండా సాధించుకోవచ్చన్నారు. నేటి పరిస్థితులలో విద్యార్థి నుండి పెద్దవారి దాకా మానసిక ఒత్తిడికి గురై ప్రాణాలు తీసుకునే దాకా వస్తుందని ఈ ప్రమాధాన్ని అరికట్టాలంటే ప్రతీ ఒక్కరు మానసిక ప్రశాంత సాధన చేయాలని తెలిపారు. భువనగిరి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఇంచార్జి కార్యదర్శి వి. మాధవిలత మాట్లాడుతు మానసిక ఒత్తిడి అనేది మనిషి ఆరోగ్యాన్ని క్రుంగ తీస్తుందని తెలిపారు. సమాజములో మానసిక ఆరోగ్యం కోల్పోయినవారికి ప్రతీ ఒక్కరు చేయుత ఇవ్వాలని వీరికి న్యాయ సేవ అధికార చట్టం ప్రకారం ఉచిత న్యాయ సహాయం పొందటానికి అర్హత ఉందన్నారు. జిల్లా మానసిక ఆరోగ్య వైద్య అధికారి డా. ప్రీతి స్వరూప్ మానసిక ఆందోళనకు, ఒత్తిడికి మూలాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్య చికిత్స విధానాలు పవర్ పాయింట్ ప్రెసెంటేషన్‌తో కార్యక్రమంలో పాల్గొన్నవారికి వివరించారు. డిప్యూటి డి.యం. హెచ్. ఒ శిల్పిని మాట్లాడుతు ఉచిత వైద్య సహాయం కౌన్సిలింగ్ కు టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. కవిత, భువనగిరి న్యాయ వాదుల సంఘం అధ్యక్షులు బి. హరినాథ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ రెడ్డి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ జైపాల్, శంకర్, న్యాయవాదులు, భువనగిరి కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలేరు-శ్రీనివాసపురం రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దూపటి వెంకటేష్

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు నుండి శ్రీనివాసపురం గ్రామానికి వెళ్ళే పాత హైవే రోడ్డును మరమ్మతులు వెంటనే చేపట్టాలని, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దూపటి వెంకటేష్ సంబంధిత అధికారులను కోరారు. ఆలేరు మండలం గుండ్లగూడం గ్రామంలో బుధవారం రాత్రి సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఎదనూరు కిష్టయ్య అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు నుండి శ్రీనివాసపురం గ్రామానికి వెళ్ళే పాత హైవేరోడ్డుపై, గుండ్ల గూడెం, పటేల్ గూడెం, శివలాల్ తండా, శ్రీనివాసపురం గ్రామాల ప్రజలు నిరంతరం రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు. వేలాది మంది ద్విచక్ర వాహనదారులు, ప్రజలు ప్రయాణిస్తున్న ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. గుంతలలో పడి ద్విచక్ర వాహనదారులు తరుచు ప్రమాదాల బారిన పడుతున్నారని, గుంతలను తారు రోడ్డు వేసి పూడ్చి తక్షణమే మరమ్మత్తు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైల్వే గేట్ ఉండడం వలన ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. రైల్వే గేటుకు ప్రత్యామ్నాయ మార్గాలను వేసి నాలుగు గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఉందని తెలియజేశారు. సమస్యల పరిష్కారం కొరకు, ఆయా గ్రామాల ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా మిట్ట శంకరయ్య, సహాయ కార్యదర్శి గా చెక్కిళ్ళ ఉపేంద్ర ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభ లో మండల కార్యదర్శి వర్గ సభ్యులు జూకంటి పౌలు, మేకల బాలరాజు, మడిపల్లి ఆంజనేయులు, బింగి చంద్రయ్య, కిష్టయ్య, గ్యార అండాలు, అనురాధ, అఖిల తదితరులు పాల్గొన్నారు.

పూర్ణగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చోరీ

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



గుర్తుతెలియని దుండగులు పూర్ణగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చోరీకి పాల్పడిన ఘటన మండల పరిధిలోని నమాత్‌పల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలో గల పూర్ణగిరి స్వయంభు శ్రీ సుదర్శన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు హుండి దొంగతనానికి పాల్పడ్డారు. దాదాపు నెల రోజుల నుంచి వచ్చిన ఆదాయం పోయింది. హుండీ తాళాలు పగలగొట్టి, డబ్బులను ఎత్తుకెళ్లారు. కాగా గతంలో నాలుగు ఐదు సార్లు దొంగతనాలు జరిగాయని భక్తులు ఆరోపిస్తున్నారు. దేవాలయానికి దేవాదాయ శాఖ వారు నైట్ వాచ్మెన్‌ను ఏర్పాటు చేయాలని, పోలీసువారు పెట్రోలింగ్ నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు. దేవదాయ శాఖ వారు సకాలంలో స్పందించకపోవడంతో దొంగతనాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఆలయ పూజారి పవన్‌కుమార్ శర్మ ఈ విషయంపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ వైర్ల దొంగలను కఠినంగా శిక్షించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య

నవతెలంగాణ-వలిగొండ రూరల్

మండల పరిధిలోని జాలకాలువ గ్రామ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ మోటార్ల వైర్లను దొంగిలిస్తున్న దొంగలను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామిలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జాలుకాలువ పరిధిలోని వ్యవసాయ భూముల భూముల్లో ధర్మారెడ్డిపల్లి కాలువ వెంట మోటార్లకు ఉన్న విద్యుత్ వైర్లను అనేక సందర్భాల్లో గుర్తుతెలియని దుండగులు దొంగిలిస్తున్నారని దీనివల్ల రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఒకే పంటలో ఇప్పటికి మూడుసార్లు వైర్ల దొంగతనానికి పాల్పడ్డారని పోలీసు యంత్రాంగం రెవెన్యూ యంత్రాంగం దీనిపై దృష్టి పెట్టి దొంగల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని వారి రాకపోకలను గుర్తించి వెంటనే దోషులను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు.

పురుషోత్తం రెడ్డి దశదిన కర్మకు హాజరైన కుంభం

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



హైదరాబాద్ హైటెక్స్‌లో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి , తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సీఎం భట్టివిక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ యంపి కేవీపీ రాంచంద్రారావు, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు



దుర్గామాత మండపాల్లో క్యామా ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో ఇంద్రపాల దుర్గామాత ఉత్సవ కమిటీ, మైసమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపాల వద్ద గురువారం బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామా మల్లేశ్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులకు రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందించి భక్తి భావంతో ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొడారి వెంకటేష్, మేకల నరేష్, బోనగిరి రజిని కాంత్, జంగయ్య, గణేష్, సత్యనారాయణ దశరథ, మహేష్, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కుంభంను కలిసిన జిల్లా క్రీడల అధికారి

నవతెలంగాణ-భువనగిరి

ఎమ్మెల్యే కుంభము అనిల్ కుమార్‌ను జిల్లా క్రీడల అధికారి కే. దనుంజయ హైదరాబాద్‌లో గురువారం కలిసారు. సీఎం కప్ సందర్భంగా భువనగిరిలో నిర్వహించే క్రీడా ర్యాలికి హాజరుకావాలని ఆహ్వానించారు.



డ్రాలో ఎలక్ట్రికల్ బైక్ గెలుపొందిన జగదీశ్ చారి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండల కేంద్రంలో గురువారం లేమ్స్, ఎలక్ట్రికల్ బైక్ షోరూంలో లక్కీ కూపన్ డ్రా షోరూం ప్రోప్రైటర్ బీబీనగర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, పట్టణంలోని ప్లైవుడ్ షాప్ యజమాని జగదీశ్ చారి ఎలక్ట్రికల్ సూట్ స్కూటీ బైక్ గెలుపొందారు. ల్మాస్ సీఈఓ మోటార్స్ సీఈవో బీబీనగర్ లక్ష్మణ్ ,ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, సీనియర్ వాయమ్మ ఉపాధ్యాయులు పూల నాగయ్య చేతుల మీదుగా గెలుపొందిన బహుమతి ప్రధానం చేశారు. ద్వితీయ బహుమతులు ఎలగందుల రవీందర్, గ్యార కుమారు, తృతీయ బహుమతి సెకండ్ మనిషా, గొలను కొండ అజయ్ డ్రాలో పాల్గొన్న ఇతర సభ్యులకు బహుమతులు ప్రధానం చేశారు.

సీసీ రోడ్ నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మున్సిపాలిటీ 6వ వార్డ్ బహదూర్ పేట కి చెందిన న్యూ శాంతి నగర్ (బేడా బుడిగ జంగాల కాలనీ) లో సడిఎఫ్ నిధులతో మంజూరు చేసినటువంటి సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాయపురం నరసింహులు, మాజీ సర్పంచ్ కూళ్ల నరసింహులు, వట్టిపల్లి శ్రీనివాస్, అంగిడి ఆంజనేయులు, వట్టిపల్లి సిద్ధిమల్లయ్య ,కూళ్ల సిద్దులు, వట్టిపల్లి సిద్ధిరాజు ,పల్లె శ్రీనివాస్, చిన్నం యాదగిరి, కూళ్ల బిక్షపతి ,కూళ్ల జహంగీర్, యాదగిరి ,దొంతుల సరేష్, మల్లెల శ్రీకాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయం తీసుకోకుండా యంత్రాలతో పని చేస్తే ఉపేక్షించేది లేదు

- పర్యావరణ పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ జిల్లాల పెంటయ్య
- పరిశ్రమ ప్రతిపాదిత ప్రాంతంలో పనులను అడ్డుకున్న నాయకులు

నవతెలంగాణ-రామన్నపేట




ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించక ముందే సిమెంటు పరిశ్రమ ఏర్పాటుకు యాజమాన్యం యంత్రాలతో ప్రతిపాదిత ప్రాంతంలో పని చేస్తే ఉపేక్షించేది లేదని రామన్నపేట పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జల్లల పెంటయ్య అన్నారు. ఆదాని అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయబోయే స్థలంలో గురువారం జెసిబి యంత్రాలతో పనిచేస్తుండగా అఖిలపక్షాలు కలసి యంత్రాలను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పర్యావరణాన్ని దెబ్బతీసే ఆదాని అంబుజా సిమెంట్ పరిశ్రమ ఈ ప్రాంతంలో నెలకొల్పోవద్దని ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేదాకా ఎలాంటి పనులు చేయవద్దని తెలిపారు. ప్రజలను, రైతులను మాయమాటలతో మోసం చేసి భూములు కొనుగోలు చేసి ఇప్పుడు కాలుష్య పరిశ్రమను ఏర్పాటు చేయడం ప్రజలను మోసం చేయడమే అని ఆయన అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను కూడా అడ్డుకుంటామని, దీనికి ప్రజలందరూ ముక్తకంఠంగా వ్యతిరేకించాలని కోరారు. ఈనెల 15న రామన్నపేట మండల కేంద్రంలో సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నిర్వహించే సదస్సుకు పరిసర గ్రామాల ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గురజాల అంజిరెడ్డి, సీపీఐ(ఎం) నాయకులు కందుల హనుమంతు, మునికుంట్ల లెనిన్, అఖిలపక్ష నాయకులు గోపగోని సహదేవ్, బి.ఆర్.ఎస్ గ్రామ అధ్యక్షుడు బుర్ర శ్రీశైలం, సీపీఐ(ఎం) గ్రామ కార్యదర్శి శానాగొండ వెంకటేశ్వర్లు, ఎర్ర రవీందర్, రేపాక లింగస్వామి, శానాగొండ రాము, అంతటి సత్తయ్య, ఆకిటి శ్రీను, జల్లెల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై ప్రతిపక్షాల అక్కసును ఖండిద్దాం

- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సిరిగిరెడ్డి నర్సిరెడ్డి

నవతెలంగాణ-రామన్నపేట



కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రుణమాఫీ చేసి తీరుతుందని, ఏ ఒక్క రైతుకూడా అధైర్యపడవద్దని, రైతు రుణమాఫీపై ప్రతిపక్ష పార్టీల అక్కసును ఖండిద్దామని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సిరిగిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎప్పుడు రుణమాఫీ జరిగినా ఏక మొత్తంలో, ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో లక్ష రూపాయల రుణమాఫీకి ఎన్ని బాధలు పడ్డామో అందరికీ తెలుసు, ఐదు సంవత్సరాల కాలంలో తీసుకున్న రెండు లక్షల రూపాయల పంట రుణాలు అన్నిటిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. కొన్ని సాంకేతిక, బ్యాంకు అధికారులు చేసిన తప్పిదాల వల్ల కొందరికి రుణమాఫీ జరగలేదని, దానిని కూడా రానున్న కొద్ది రోజుల్లోనే మాఫీ చేయడానికి ప్రభుత్వం కార్యాచరణలో ఉందన్నారు. ప్రతిపక్షాలు రుణమాఫీ చేయడం ఇష్టం లేక ఓర్చుకోలేక రైతుల పేరుతో వారి కార్యకర్తలను రెచ్చగొట్టి ఏదోరకంగా అలజడి సృష్టించాని చూస్తున్నారు. రుణమాఫీకాని రైతులు ఉంటే కారణాలను బ్యాంక్‌లో తెలుసు కొని అధికారుల దృష్టికి తీసుక రావాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కూడా అర్థం చేసుకోవాలన్నారు. ఆయన రైతు పక్షపాతి ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుందన్నారు. నిజమైన రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. రైతులు అర్థం చేసుకోవాలని వేడుకున్నారు.

గొప్ప మానవతావాది రతన్ టాటా

- దేశం కోసం కృషి చేసిన దేశభక్తుడు పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా చిరస్మరణీయుడు
- సామాజిక ఉద్యమ నాయకులు కొడారి వెంకటేష్, బట్టు రాంచంద్రయ్య

నవతెలంగాణ-భువనగిరి



పారిశ్రామిక దిగ్గజం, గొప్ప మానవతావాది రతన్ టాటా చిరస్మరణీయుడని సామాజిక ఉద్యమ నాయకులు కొడారి వెంకటేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద రతన్ టాటా సంతాపసభను సామాజిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొడారి వెంకటేష్ మాట్లాడుతూ రతన్ టాటా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని పరిశ్రమలను నెలకొల్పాడని ఆయన అన్నారు. భారత ప్రభుత్వం రతన్ టాటాకు భారత రత్న ఇచ్చి గౌరవించాలని ఆయన కోరారు. కరోనా కాలంలో ఎందరో అభాగ్యులను ఆదుకున్న గొప్ప మానవతా వాది రతన్ టాటా అని ఆయన అన్నారు. సుమారు 40 కంపెనీలకు యజమానిగా ఉంటూ.. లక్షలాది మంది కార్మికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత రతన్ టాటాకే దక్కుతుందని ఆయన అన్నారు. సమావేశంలో సామాజిక ఉద్యమ నాయకులు బట్టు రాంచంద్రయ్య మాట్లాడుతూ బ్రిటిష్ వారి కంపనీలను కొనుగోలు చేసి, వారినే కార్మికులుగా నియమించి మన దేశ ప్రతిష్టను రతన్ టాటా ఉన్నత స్థానంలో ఉంచారని ఆయన అన్నారు. ఈ సంతాప సమావేశంలో సామాజిక ఉద్యమ నాయకులు, జర్నలిస్టులు పాక జహంగీర్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, ఉస్మాన్ షరీఫ్, బాలకృష్ణలు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మోత్కూర్

మండలంలోని పొడిచేడు గ్రామానికి చెందిన తొంట చినమల్లమ్మ మృతి చెందగా గురువారం అదే గ్రామానికి చెందిన పేలపూడి చౌదరి బ్రదర్స్, సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పేలపూడి మధులు కుటుంబానికి 5 వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లం రమేష్,కొప్పె మల్లేష్, బిసు అనిల్, తొంట సుగుణమ్మ, మల్లేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
శుక్రవారం | అక్టోబర్ 11 , 2024 | www.navatelangana.com

నేడు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూమి పూజ

- జయప్రదం చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుండుగోని రామచంద్ర గౌడ్ పిలుపు

నవతెలంగాణ-మోత్కూర్

తుంగతుర్తి నియోజక వర్గం తిరుమలగిరి తొండా గ్రామంలో మూడు వందల కోట్లతో నిరించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భూమి పూజ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుండగొని రామచంద్రు గౌడ్ అన్నారు. గురువారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూమి పూజ కార్యక్రమాన్ని కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి గుర్రం కవిత లక్ష్మీ నరసింహా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు పైళ్ల సోమి రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ పేల పూడి వెంకటేశ్వర్లు,మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు,మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లె పల్లి వెంకటయ్య,కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మలిపెద్ది మల్లా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పీడీఎస్‌యూ అర్ధశతాబ్దోత్సవ సభలను జయప్రదం చేయండి'

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) అర్ధ శతాబ్ది ఉత్సవాల సభలను జయప్రదం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో రైల్వే గేట్ ఆవరణలో గురువారం ఆ సంఘం సభ్యులు పోస్టర్ ఆవిష్కరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పీడీఎస్‌యు రెండు రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో అక్టోబర్ 24 న,హైదారాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో భారీ ఎత్తున బహిరంగ సభను అక్టోబర్ 18న ఆలేరు దినేష్ ఫంక్షన్ హాల్‌లో విజయవంతం చేయాలని పీడీఎస్‌యు, జిల్లా నాయకులు ఆర్.ఉదయ్, మామిడాల ప్రవీణ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్ ,పీ వై ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు గడ్డం నాగరాజు, పీ వై ఎల్ జిల్లా అధ్యక్షులు సాదుల శ్రీకాంత్, నాయకులు మామిడాల సతీశ్,ఏనుగుల ఉదయ్, ఇక్కిరి కుమార్, శికిలం వెంకటేష్, మామిడాల మధు, కోలా క్రాంతి, పంజాల మురళి పాల్గొన్నారు.

వాడవాడలా.. ఘనంగా బతుకమ్మ సంబురాలు

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

గురువారం.మున్సిపల్ పట్టణ కేంద్రంలో గ్రామాలలో ప్రకృతి పువ్వులతో బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా పువ్వులను పూజిస్తూ ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండుగ బతుకమ్మ మహిళలు కన్నుల విందుగా జరుపుకున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా తీరక పువ్వుతో తంగేడు పట్టుకుచ్చు చామంతి గునుగు పువ్వు బతుకమ్మలను పేర్చి తెలంగాణ మహిళలు అంగరంగ వైభవంగా జరుపుకునే పండుగ సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా మహిళలు గ్రామీణ ప్రాంతాలలో ఉయ్యాల పాటలతో ప్రారంభమై ఆటపాటలతో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ


భూదాన్ పోచంపల్లి

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి మున్సిపల్ కౌన్సిలర్లు పట్టణ మహిళలు 11వ వార్డులో కౌన్సిలర్ కుడికాల అఖిల బలరాం బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.గ్రామాలలో మహిళలు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.

ఆలేరుటౌన్: ఆలేరు పట్టణంలో, మండలంలోని పలు గ్రామాలలో గురువారం ప్రకృతిలో దొరికే వివిధ రకాల పూలతో సద్దుల బతుకమ్మ పండగ వేడుకలు మహిళలు సామూహికంగా ఒకచోట చేరి ఉయ్యాల పాటలతో ఆడుతూ పాడుతూ భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పండగ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మ పాటలలో సమైక్యతను చాటరు. తెలంగాణ చరిత్ర, భారత రామాయణ, ఇతిహాస గాథలు పలువురి ప్రముఖుల జీవన విధానం ఘటనలు


ఆలేరుటౌన్..

గుర్తు చేసుకున్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం వివరిస్తూ, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతలను తెలియజేస్తూ, రైతుల, కార్మిక, కర్షకుల కష్టసుఖాలను తెలియజేస్తూ, శ్రీ సంతోష్ మాత


ఆలేరుటౌన్..

దేవాలయం, శ్రీ కనకదుర్గ ఆలయం, శ్రీగోదాదేవి ,లక్ష్మీదేవి సహిత రంగనాయక ఆలయం, బొడ్రాయి, పోచమ్మ వాడ, కురుమా సంఘం, భారత్ నగర్,అంబేద్కర్ నగర్, రెడ్డిగూడెం, బీసీ కాలనీ, సిల్క్ నగర్, క్రాంతి నగర్, బృందావన్ కాలనీ, కాటమయ్య నగర్, ఆదర్శనగర్ తో పాటు బహదూర్ పేట, సాయి గూడెంలలో మహిళలు ఒకచోట సామూహికంగా చేరి బతుకమ్మల చుట్టు తిరుగుతూ ఆడి పాడారు. మండలంలోని కొలనుపాక గ్రామంలో సోమేశ్వరాలయం, గ్రామపంచాయతీ, రైతు వేదికల వద్ద మహిళలు సామూహికంగా బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. రాఘవపురం, బైరాన్ నగరం, పటేల్ గూడెం, శ్రీనివాస్పురం, శివలాల్ తండా, కంది గడ్డ తండా, గుండ్లగూడం, టంగుటూరు, శారాజుపేట, తూర్పుగూడెం, మందనపల్లి, కొల్లూరు, తూర్పుగూడెం, శర్బనాపురం, మంతపురి గ్రామాలలో పాలు కాలనీలలో మహిళలు సామూహికంగా బతుకమ్మలను ఆడి పాడారు. చిన్నారులు పెద్దలు టపాసులు పేల్చి సంబరాలలో పాల్గొన్నారు. అనంతరం పోయిరా బతకమ్మ అంటూ గంగానీటిలో వదిలారు. స్వీట్లు పప్పు బెల్లం చక్కెర ప్రసాదం పలువురికి పంచారు.

ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ పండుగ అని మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య అన్నారు. ఆలేరు మండల కేంద్రంలో గురువారం సద్దుల బతుకమ్మ సందర్భం పురస్కరించుకొని, ప్రేమ సేవా సదనం స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసిన వాయనాల పంపిణీ చేశారు. శ్రీ రామకృష్ణ విద్యాలయం కరస్పాండెంట్ బండిరాజుల శంకర్, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రం లోనే బతుకమ్మ పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బాపు రెడ్డి,మాజీ సర్పంచ్ ఆకవరం మోహన్ రావు,కౌన్సిలర్ గుత్తా శమంత రెడ్డి, సీనియర్ జర్నలిస్టు తిరునగరి శ్రీనివాస్, ప్రేమ సేవా సదనం స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మహమ్మద్ ఖుర్షీద్ పాషా, బాబు, పరశురాములు, జానకి, మున్నీ, సోనీ, లావణ్య ఇర్ఫాన్, చోటు, మహేందర్, భాను, సాయిరామ్, వెంకటేష్, రమేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.


మోత్కూర్..

మండలో సాయి గూడెం గ్రామంలో గురువారం రాత్రి సద్దుల బతుకమ్మ పండుగలో మాజీ శాసన సభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేశం, టిఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

మోత్కూర్: మండలంతో పాటు మున్సిపల్ కేంద్రంలోనూ గురువారం రంగురంగుల తీరొక్క పూలతో సద్దుల బతుకమ్మ, సంబరాలను మహిళలు ఆడపడుచులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రంగురంగు పూలతో అందంగా బతుకమ్మను పేర్చి బతుకమ్మను తీసుకెళ్లి బతుకమ్మ ఆటలు, ఆడుతూ. పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆవరణలో, మార్కెట్ యార్డులో ఆవరణలో బతుకమ్మ ఆడడానికి మున్సిపల్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బతుకమ్మ ఆడిన అనంతరం ఆయా చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో. మున్సిపల్ చైర్ పర్సన్ కవిత లక్ష్మీనరసింహారెడ్డి, కమిషనర్ బి శ్రీకాంత్, గ్రామ అధికారులు,


బొమ్మలరామారం

నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలరామరం: తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ సంబరాలను గురువారం బొమ్మలరామారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తీరొక్క రకం రంగురంగుల పూలను సేకరించి బతుకమ్మ పేర్చి ప్రదర్శనగా వెళ్లి ఒకచోట చేర్చి సాంప్రదాయ బతుకమ్మ పాటలు కోలాటాలతో బతుకమ్మ సంబరాలను చేసుకున్నారు.

నూతనకల్ :

తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయమైన సద్దుల బతుకమ్మ సంబరాలను గురువారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో


నూతనకల్..

ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మహిళలు తీరొక్క రకం రంగురంగుల పూలను సేకరించి బతుకమ్మ పేర్చి ప్రదర్శనగా వెళ్లి ఒకచోట చేర్చి సాంప్రదాయ బతుకమ్మ పాటలు కోలాటాలతో బతుకమ్మ సంబరాలను చేసుకున్నారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్ పర్సన్ నాగం జయసుధ సుధాకర్‌రెడ్డి మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మహిళా రాజకీయ నాయకురాలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


మునగాల

మద్దిరాల: మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్దుల బతుకమ్మ బతుకమ్మను ఘనంగా నిర్వహించుకున్నారు. సాయంత్రం బతుకమ్మలు బయటకు వెళ్ళే సమయంలో మండలంలో వర్షం కురవడంతో మహిళలు,కొంత నిరుత్సనికి గురైన చివరిలో వర్షం తగ్గడంతో మహిళలు తమ అందాన్ని వ్యక్తం చేశారు.గ్రామ చెరువుల వద్ద బతుకమ్మలను ఒక్క దగ్గర చేర్చి డీజే పాటలతో తెలంగాణ సాంప్రదాయ పాటల మధ్య కోలాటాలు వేసి పోయిరా బతకమ్మ


హుజూర్‌నగర్‌లో..

పోయిర అని బతుకమ్మలను చెరువులలో నిమజ్జనం చేశారు.

మునగాల: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మహిళలు ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలనుని ర్వహించారు. ఈ సందర్భంగా తాహసీల్దారు వలిగొండ ఆంజనేయులు, ఎంపీడీఓ రమేష్ దీన్ దయాళ్ మాట్లాడుతూ పూలనే పూజించే గొప్ప సంస్కృతి గల ఈ తెలంగాణలో ప్రకృతిని పూజించే గొప్ప పండగ బతుకమ్మ పండగని తెలిపారు. మహిళామణులందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామారావు, ఇందిరా క్రాంతి పథకం, మహిళలు స్త్రీ శిశు సంక్షేమశాఖ, పంచాయతీరాజ్ శాఖ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ :పట్టణంలోనే రామాలయంలో బతుకమ్మ వేడుకలు సందర్భంగా చివరి రోజైన గురువారం మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మలను తీసుకొని వచ్చి సాంప్రదాయపరంగా ఆట పాటలతో బతుకమ్మ పాటలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు మహిళలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కావలసిన ఏర్పాట్లు వేణుగోపాలస్వామి దేవాలయం నిర్వాహకులు మరియు ఆలయ అర్చకులు ఏర్పాట్లు చేశారు బతుకమ్మలను మంచిగా పేర్చిన మహిళలకు ఆలయ కమిటీ వారు బహుమతులు ప్రధానం చేశారుపెద్ద ఎత్తున మహిళలు పాల్గొని బతుకమ్మ పండుగలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మురళీ కృష్ణమాచార్యులు ముడుంబా జగన్నాథచార్యులు వెన్న పద్మ రామిశెట్టి రాము పొనుగుపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.









మాజీమంత్రి జగదీశ్ రెడ్డి పై అభిమాని కొండంత అభిమానం

నవతెలంగాణ-సూర్యాపేట

మాజీమంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి చిత్రాన్ని పెన్సిల్‌తో గీసి ఆయన పై ఉన్న కొండంత అభిమానాన్ని చాటుకున్నాడు ఒక అభిమాని. మెదక్ జిల్లా వాసి ప్రొఫెషనల్ అర్టిస్ట్ దానియెల్ ప్రతి ఏటా ఓ చిత్రాన్ని గీసి జగదీశ్ రెడ్డికి అందజేసి తన అభిమానాన్ని చాటుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సైతం జగదీశ్ రెడ్డి చిత్రాన్ని గీసి గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి దానియెల్‌ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ పుట్ట కిషోర్, సీనియర్ నాయకులు గండూరి ప్రకాష్, జీవన్‌రెడ్డి, కౌన్సిలర్లు భాష,తాహెర్, బత్తుల జానీ,బిగ్ బాస్ శ్రీను పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-తిరుమలగిరి సాగర్

మండలంలోని అల్వాల గ్రామంలో గురువారం దేవీ నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా 8వ రోజు దుర్గాదేవిగా అవతారం ఎత్తిన దేవికి గురువారం మాజీ సర్పంచ్ పింకీస్ పాపిరెడ్డి సరస్వతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పాడి పంటలు సమృద్ధిగా పండి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని దుర్గామాత ను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సమస్యల పరిష్కారం కోసం కృషి

- రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-సూర్యాపేట



రాష్ట్రంలో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కమిటీ కృషి చేస్తుందని అసోసియేషన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం స్థానిక జీవీవి గార్డెన్లో జరిగిన పట్టణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఇప్పటికే అసోసియేషన్ ఆధ్వర్యంలో మృతి చెందిన ఫొటో, విడియో గ్రాఫర్‌ల కుటుంబాలకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేస్తున్నామని తెలిపారు. కాగా ఓటింగ్ ద్వారా నిర్వహించిన ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ పట్టణ ఎలక్షన్ల అనంతరం ఎన్నికైన నూతన కార్యవర్గంతో ఆయన ప్రమాణ స్వీకారోత్సవం చేసి నియామక పత్రాలు అందజేశారు. సూర్యాపేట పట్టణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొక్కుల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కూకుంట్ల శంకర్, కోశాధికారిగా రాపర్తి మహేష్ గౌడ్ లను ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు పట్టణం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ వ్యవస్థాపన అధ్యక్షులు సందాల కాశీరత్నం , తాటి రవీందర్ ,గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు చంద్రశేఖర్,జిల్లా అధ్యక్షులు కూకుట్ల లాలయ్య,నల్గొండ జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీమన్నారాయణ, నల్గొండ లక్ష్మణ్ ,రాష్ట్ర నాయకులు మల్లికార్జున్ , సిద్ధి శ్రీకాంత్, గన్నోజ హరినాథచారి, గుణగంటి సురేష్ గౌడ్, సాయి రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు కొచ్చర్ల రవి, మాజీ కార్యదర్శి నజీర్, గుమ్మడవెల్లి శ్రీనివాస్, గీత ,చంద్రశేఖర్, ఫ్రీ లైన్స్ అసోసియేషన్ శ్రీధర్ , ప్రభాకర్ రెడ్డి ,పాషా, జానయ్య, కస్తూరి శీను, లక్ష్మీనారాయణ, ఆర్ఆర్ ల్యాబ్ శేఖర్, రెడ్ ఇన్ ల్యాబ్ శ్రీను, మిక్సింగ్ పాషా, రాము, రవి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-ఆత్మకూర్ ఎస్

మండలంలోని పాతర్లపహాడ్ క్రాస్ రోడ్ సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మి మోడరన్ రైస్ మిల్‌లో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వెళ్లి చూడగా రైస్ మిల్లులో పెద్ద మొత్తంలో బియ్యం నూకలు కుప్పగా పోసి ఉన్నాయి. వాటిని పీడీఎస్ బియ్యం అని అనుమానంతో వెంటనే సూర్యాపేట సివిల్ సప్లయ్ అధికారికి సమాచారం ఇవ్వగా డిటి నాగలక్ష్మి వారి సిబ్బంది వచ్చి పరిశీలన చేసి సుమారు 100 క్వింటాల నూకలు , క్వింటా పీడీఎస్ రైస్ స్వాధీన పరుచుకుని పంచనామా చేసి టీఏతో శాంపిల్ తీయించారు. నిల్వ ఉన్న నూకలను గోడౌన్‌కు తరలించారు. సివిల్ సప్లయ్ అధికారి డిటీ నాగలక్ష్మి పిర్యాదు చేయగా ఈ పిర్యాదు పై రైస్ మిల్లు యజమాని కాసం రమేష్ పై కేసు నమోదూ చేశామని ఎస్ఐ వై . సైదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ కానిస్టేబుల్ కిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు ఆకర్షితులై సీపీఐ(ఎం) లో చేరిక

నవతెలంగాణ-నూతనకల్

సీపీఐ(ఎం) చేస్తున్న ప్రజా పోరాటాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుండి సీపీఐ(ఎం)లో చేరుతున్నారని ఆ పార్టీ మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి అన్నారు.గురువారం మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో వివిధ పార్టీల నుండి నూతనంగా సిపిఐఎం లో చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న కృషికి ప్రజలు ఆకర్షితులైతున్నారని, పార్టీకి నియోజకవర్గంలో పూర్వ వైభవం వస్తుందన్నారు. పార్టీలో చేరిన వారిలో పంతం యల్లయ్య, పంతం కిష్టమ్మ మెడిచర్ల రజిత, పంతం సుధ, పంతం లింగయ్య, పంతం యల్లమ్మ తోపాటు మరి కొంతమంది ఉన్నారు. ఈ కార్యక్రమం లో బొజ్జ శ్రీను, సామ సురేందర్ రెడ్డి అల్లిపురపు సంజీవరెడ్డి, బత్తుల సోమయ్య, గజ్జెల శ్రీనివాస్ రెడ్డి, కూసు సైదులు, తోట్ల లింగయ్య బొజ్జ విజయ్, బత్తుల తిరుమలేష్ , ఉప్పుల పరమేష్, పంతం వెంకన్న, కామ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ డంపులు సీజ్

నవతెలంగాణ-పెన్‌పహాడ్

ఇన్‌చార్జ్ తహసీల్దార్ లాలునాయక్ ఉత్తర్వుల మేరకు మండల పరిధిలోని నాగులపహాడ్ గ్రామంలో అక్రమంగా నిల్వఉంచిన ఇసుక డంపులను రెవెన్యూ ఇన్స్పెక్టర్ రంజిత్ కుమార్ పోలీస్ వారితో కలిసి గురువారం పరిశీలించారు. అందులో భాగంగా అక్రమంగా ఇసుక నిల్వ చేసిన సుంకరి సంజీవకు చెందిన 15 ట్రిప్పులు, భుక్య టికంనాయక్ భూమిలో తొమ్మిది ట్రిప్పుల ఇసుక డంపును గుర్తించి అట్టి ఇసుక డంపులను పంచనామా నిర్వహించి సీజ్ చేశారు. అక్రమంగా ప్రభుత్వ నిభందనలను అతిక్రమించి ఇసుక డంపు చేసిన సుంకరి సంజీవ మరియు భుక్య టికంనాయక్ లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పెరిక రవీందర్ తెలిపారు.

చెరుపల్లి లక్ష్మమ్మకు ప్రముఖుల నివాళులు

నవతెలంగాణ-ఆలేరుటౌన్


ఆలేరుటౌన్..

సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చేరుపల్లి సీతారాములుకి మాతృవియోగం చెందగా, మాతృమూర్తి చెరుపల్లి లక్ష్మమ్మకి సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యవర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశంలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. చెరుపల్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి , సంతాపం తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో ఆలేరు పట్టణ కార్యదర్శి ఎంఎ ఇక్బాల్ ,డివైఎఫ్ఐ జిల్లా నాయకులు చేన్న రాజేష్, ఆవాజ్ నాయకులు ఎండి అప్సర్, సిపిఐఎం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్లాక్‌టవర్ :

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాతృమూర్తి చెరుపల్లి లక్ష్మమ్మ (96) భర్త వెంకట నరసయ్య గురువారం హైదరాబాదులోని మృతి చెందింది. ఆమె మృతికి సీపీఐ(ఎం) నల్గొండ జిల్లా కమిటీ తీవ్ర సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానం

నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని నిమ్మికల్ గ్రామానికి చెందిన గోలి సురేష్ ఎస్జీటిగా ఉద్యోగం పొందినాడు. గురువారం అతనికి మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయం వద్ద సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మనం ఫౌండేషన్ అధ్యక్షులు గంపల కృపాకర్, గంపల నారాయణ, పురం జాన్, గంపల కరుణాకర్, కె కరుణాకర్, గరిగంటి రజిత, పవన్, సురేష్ రాకేష్ పాల్గొన్నారు.

కీతవారిగూడెం వాసికి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం

నవతెలంగాణ-గరిడేపల్లి

మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన నర్సింగ్ నరేష్ స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయునిగా ఉద్యోగం సాధించారు. ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్ఏ తెలుగు విభాగంలో సూర్యాపేట జిల్లా నాలుగో ర్యాంకు, ఎల్పి తెలుగు విభాగంలో 9వ ర్యాంక్ సాధించారు. నరేష్ గతంలో యుజిసి నెట్ ఫలితాలలో తెలుగు సబ్జెక్టుకి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కి క్వాలిఫై కావడం విశేషం. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు, బంధుమిత్రులు అభినందనలు తెలియజేశారు.

రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు

నవ తెలంగాణ మోత్కూర్



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ స్కీంలో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలో సింగిల్ ప్యాకేజీలో డెవలప్ మెంట్ పనులు జరుగుతున్నాయని పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. యాదాద్రి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో అమృత్ స్కీంలో రూ.12 కోట్లతో నిర్మిస్తున్న మంచినీటి ట్యాంకులు, టీయూఎఫ్ ఐడీసీ ఫండ్స్ రూ.10 కోట్లతో చేస్తున్న రోడ్డు విస్తరణ, డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చిట్యాల, నేరేడుచర్ల మినహా మిగతా 17 మున్సిపాలిటీల్లో, ఖమ్మంలోని 9 మున్సిపాలిటీల్లో అమృత్ స్కీంలో పనులు జరుగుతున్నాయన్నారు. మోత్కూరు మున్సిపాలిటీలో అమృత్ స్కీంలో పట్టణంలో శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వ కాలేజీ, హైస్కూల్ ఆవరణల్లో భారీ ట్యాంకులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కాంట్రాక్టర్లు పనులన్నింటినీ నాణ్యతగా చేయాలని, నాణ్యత లోపిస్తే బిల్లులు చేయవద్దని, ఆఫీసర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ గుర్రం కవితలక్ష్మీ నర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ డీఈఈ మనోహర, ఏఈ సురేష్ ఆయన వెంట ఉన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసిన ఘటన భువనగిరి మండల పరిధిలోని అనంతారం శివారులో ఎల్లమ్మ టెంపుల్ సమీపంలో ఫంక్షన్ హాల్లో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం భువనగిరి రూరల్ ఎస్సై సంతోష్ కుమార్ రాత్రి పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తుండగా యెల్లమ్మ టెంపుల్ వద్ద ఉన్న ఫంక్షన్ హాళ్లు చెక్ చేస్తుండగా, మల్లికార్జున మినీ ఫంక్షన్ హాల్ లో 6 వ్యక్తులు పేకాట ఆడుతుండగా, వారి సిబ్బంది తో కలిసి వారిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. అరెస్టు అయినవారిలో 1. పాండు 2. మల్లేశ్ 3. ప్రశాంత్ 4. వెంకటేష్ 5. లక్ష్మణ్ 6. నర్సింగరావ్ వీరి వద్దనుండి రూ.23,610 2 సెట్ల పేక ముక్కలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనపర్చుకొని వారి మీద కేసు నమోదు చేసి, పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

నేడు ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపన

నవతెలంగాణ-తిరుమలగిరి

నేడు ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు ఎంపీ చామలకిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ శంకుస్థాపన చేయనున్నట్టు కాంగ్రెస్ మండల్ల అధ్యక్షులు ఎల్సోజు నరేష్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సంకేపల్లి కొండల్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు సుంకరి జనార్ధన్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు కందుకూరి అంబేద్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిలాల్, కోపరేటివ్ బ్యాంకు చైర్మన్ పాలెపు చంద్రశేఖర్ తెలిపారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మంజూరైనటువంటి 19 స్కూల్‌లలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తుంగతుర్తి నియోజకవర్గానికి మంజూరు కావడం హర్షణీయమని, ఇది ఈ ప్రాంత ప్రజల అదృష్టమని తెలిపారు. ఈ కార్యక్రమానికి శుక్రవారం 10 గంటలకు తొండ గ్రామంలో శంకుస్థాపన కార్యక్రమానికి స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు సంకేపల్లి సుధీర్ రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు బత్తుల శ్రీనివాస్, జితేందర్ ముఖ్య నాయకులు చాగంటి రాములు,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే



నవతెలంగాణ-చౌటుప్పల్

వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఇన్ పేషెంట్ రూమ్‌లను కలియతిరిగారు. పేషెంట్ల వివరాలను పరిశీలించారు. హాస్పిటల్ నిర్వహణ తీరును పరిశీలించి, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఇన్, ఔట్ పేషెంట్ల రిజిస్టర్లను తనిఖీచేశారు. అనంతరం వార్డులను సందర్శించి, అక్కడ వైద్యం అందుతున్న పేషెంట్లతో మాట్లాడారు. హాస్పిటల్‌కు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పేషెంట్లకు వైద్య సదుపాయాలు సకాలంలో అందించాలన్నారు. హాస్పిటల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆసుపత్రిలో మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, మందుల కొరత లేకుండా చూడాలన్నారు. లేకుంటే వెంటనే మందులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. హాస్పిటల్‌లో నిర్మాణం జరుగుతున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. డయాలసిస్ యూనిట్‌ను కలెక్టర్ సందర్శించారు. అక్కడ ఉన్న వాటర్‌ప్లాంటును బయటపెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజగోపాల్, డాక్టర్ అలివేలు, డాక్టర్ దేవేందర్, డీసీహెచ్‌ఎస్ చిన్నానాయక్, డాక్టర్ శ్వేతప్రియాంక, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్



నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

పట్టణంలో ప్రయివేటు ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. గురువారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పట్టణంలోని ప్రయివేటు ఆస్పత్రులకు ఆరోగ్యం బాగోలేదని పేదలు వెళ్తే వారి జేబులు గుల్ల అయ్యే పరిస్థితి ఉందన్నారు. పేదవాడి అనారోగ్య పరిస్థితులను ఆసరాగా తీసుకోని పట్టణంలో పుట్టగొడుగుల్లా ప్రైవేట్ ఆసుపత్రులు వెలుస్తున్నాయని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనుమతులు లేని ల్యాబ్‌లు నడుస్తున్నాయని, ఫార్మాసిస్ట్‌లు లేకుండా హాస్పిటల్ అనుబంధంగా మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారని అన్నారు. ధనార్జనే ధ్యేయంగా నిబంధనలను ఉల్లంఘిస్తున్న ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు, ఎంఐఎం జిల్లా కార్యదర్శి ఫరూక్, బీఎంపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్రగిరి అంజయ్య, అంబేద్కర్ యువజన సంఘం డివిజన్ కన్వీనర్ శంకర్, పోతుగంటి సంజీవ్, శరత్‌కుమార్, మందా శేఖర్, ఎస్‌కె.ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని భూ నిర్వాసితుల వినతులు

నవతెలంగాణ-చౌటుప్పల్



త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ చౌటుప్పల్ భూనిర్వాసితులు గురువారం హైదరాబాద్‌లోని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాస గృహంలో కలిసి ఆయనకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన రాజగోపాల్‌రెడ్డి భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా కృషిచేస్తానని చెప్పినట్టు భూ నిర్వాసితులు తెలిపారు. ఎంపీ ఈటెల రాజేందర్ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌ఏఐ రీజినల్ ఆఫీసర్ పి.శివశంకర్, గజ్వేల్ పీడీ ఎం.మాధవిని భూ నిర్వాసితులు కలిసి చౌటుప్పల్, రాయగిరి, గజ్వేల్ ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని వినతిపత్రాలు అందజేశారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించారని భూనిర్వాసితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితులు చింతల దామోదర్‌రెడ్డి, మారుపాక రామలింగంగౌడ్, పెద్దిటి బుచ్చిరెడ్డి, గోపగోని లక్ష్మణ్‌గౌడ్, జాల శ్రీశైలం, సందగల్ల మల్లేశ్‌గౌడ్, అవిశెట్టి పాండు, దబ్బటి రాములుగౌడ్, గుజ్జుల సురేందర్‌రెడ్డి, బోరెం ప్రకాశ్‌రెడ్డి, అనిల్‌కుమార్, బొమ్మిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, నాగెల్లి దశరథ, ఏసిరెడ్డి దామోదర్‌రెడ్డి, రమేశ్, జంగయ్య, బాలకృష్ణారెడ్డి, అంజయ్య, యాదయ్య పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ తుంగతుర్తిలోనే ఏర్పాటు చేయాలని

- మోకాళ్ల మీద నడుస్తూ నిరసన

నవతెలంగాణ-తుంగతుర్తి

తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను, నియోజకవర్గనికి కేంద్ర బిందువు అయిన తుంగతుర్తిలోనే ఏర్పాటు చేయాలని తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ మేరకు గురువారం తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి ఆధ్వర్యంలో రెండవ రోజు మండల కేంద్రంలోని మెయిన్ రోడ్ పై మోకాళ్ళ మీద నడుస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి సభ్యులు తడకమళ్ళ రవికుమార్, మట్టిపెల్లి వెంకట్ మాట్లాడుతూ ఈనెల 11న తొండ తిరుమలగిరిలో నిర్వహిస్తున్న శంకుస్థాపన కార్యక్రమాన్ని బేషరతుగా నిలిపివేయాలని ప్రాంతీయుడని నమ్మి తుంగతుర్తి ప్రజలు 50 వేల ఓట్ల మెజార్టీతో మందుల సామెల్ ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే గద్దెనిక్కినాక తుంగతుర్తి అభివృద్ధిని కాలరాస్తూ అభివృద్ధిని అడ్డుకునే విధంగా నియోజకవర్గ కేంద్రానికి మంజూరైన ప్రభుత్వ కార్యాలయాలను,పాఠశాలలను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ తీరని ద్రోహం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే తన నిర్ణయాన్ని మార్చుకొని తుంగతుర్తి అభివృద్ధికి సహకరించాలని, లేనియెడల తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి సభ్యులు మట్టిపెల్లి శ్రీశైలం యాదవ్, బొంకూరి మల్లేష్, బొంకూరి మధు, కొండగడుపుల శ్రీకాంత్, కొండగడుపుల వెంకటేష్, కాసర్ల రాజశేఖర్, తడకమళ్ళ అనిల్, చింతకుంట్ల సురేష్,బొంకూరి సాయి కుమార్, తడకమళ్ళ మధు, బత్తుల సతీష్,ఏపూరి మహేష్,కొండ మధు, కొండగడుపుల శ్రీను, గడ్డం నితిన్, బొంకూరి బాలకృష్ణ, పోతరాజు మహేష్,బన్నీ, పాల్గొన్నారు.

సాయిబాబా గుడి చైర్మెన్ ధనంజయ్య జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-చింతపల్లి



మండల కేంద్రంలోని సాయి సన్నిధి క్షేత్రంలో గుడిచైర్మెన్ మంచి కంటి ధనంజయ్య జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాయిబాబా ట్రస్టును ఏర్పాటుచేసి గుడి అభివృద్ధికి ఎంతో కృషి చేశాడని ట్రస్ట్ సభ్యులు కొనియాడారు. నిత్య అన్నదానం, గోశాల, వృద్ధులు వితంతువులు వికలాంగులకు చేయూత, ఇంకా ఎన్నో స్వచ్ఛంద కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. సాయిబాబా గుడిలో జన్మదిన వేడుకలు చేసుకోవడం సంతోషకరమని ఆలయ చైర్మెన్ మంచి కంటి ధనంజయ అన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కొమరిశెట్టి వెంకటయ్య, ఊరే కృష్ణయ్య,కుంభం పుల్లారెడ్డి,తడకమల శ్రీనివాస్తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఊరిలోనూ పూలకళ ...మహిళల్లో లక్ష్మీ కళ

నవతెలంగాణ-తిరుమలగిరి



తెలంగాణ సంస్కృతీ, సంప్ర దాయాలకు పట్టుగొమ్మగా ని లిచిన బతుకమ్మ ఉత్సవాల్లో చివరి ఘట్టమైన సద్దుల బతుకమ్మ సంబరాలు వైభవోపేతంగా జరి గాయి. ప్రతి ఊరిలోనూ పూల పం డుగ సంబరాలు అంబరాన్ని తాకాయి. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన సంబ రాలుసద్దుల బతుకమ్మతో ముగిశాయి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ మండలంలోని ప్రతి ఊరిలోనూ మున్సిపాలిటీ కేంద్రంలోని పాత గ్రామంలో తిరుమల హిల్స్‌లో, మాలిపురంలోని ఆడబిడ్డలందరూ అత్యంత సంతోషంగా బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా పువ్వులనే దేవతగా కొలిచే అరుదైన ఈ పండుగలో పేద, ధనిక తారతమ్యాలు లేకుండా అన్ని వయస్సులవారు పాల్గొని రకరకాల పూలతో బంగారు బతుకమ్మలను పేర్చి సాంప్రదాయ పద్ధతిలో గౌరమ్మను పూజించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ శాగంటి అనసూయ రాములు, మండల అధ్యక్షుడు నరేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు సంకేపల్లి రఘునందన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుంకరి జనార్ధన్, మూల అశోక్ రెడ్డి, సంపత్ రెడ్డి,మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమ్మిలాల్, పేరాల వీరేష్, కందుకూరి లక్ష్మయ్య, పాలెపు చంద్రశేఖర్, కందుకూరి బాబు, ఆనగందుల మల్లేష్, పాల్గొన్నారు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో అడ్లూరులో
ఘనంగా బతుకమ్మ సంబురాలు

- ముఖ్య అతిధిగా పాల్గొన్న మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య
- తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ..

నవతెలంగాణ-శాలిగౌరారం

సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తిరక్క పూలను తెచ్చి అందంగా బతుకమ్మను పేర్చి మహిళలంతా ఒకచోట చేరి ఆనందంగా ఆటపాటలతో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో గురువారం ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అడ్లూరు గ్రామం లో తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని. తెలంగాణ ఆడపడుచుల అపూర్వ పండుగ బంతుకమ్మ సందర్భంగా అడ్లూరు గ్రామం లో ఆడపడుచులు ఘనంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమం లో బోడ అరుణ్ కుమార్, నిమ్మల కృష్ణ, గరిగంటి శంకర్,సింగం జానీ,నల్లగొండ శ్రీను,నోముల భాస్కర్,ఉబ్బలి వెంకన్న,వానరాశి వెంకన్న,కడమంచి మహేందర్, శీలం యాదయ్య,వేముల అంజయ్య,గోనె రవీందర్ రెడ్డి, మిర్యాల సైదులు, పాల్గొన్నారు.



యంగ్ ఇండియా-ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్
స్కూల్స్ నిర్మాణాలకు నేడు శంకుస్థాపనలు

- టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి



రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో ప్రామాణిక విద్యను అందించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నేడు (శుక్రవారం) నల్గొండ జిల్లాలోని నల్గొండ, మునుగోడు నియోజక వర్గాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ల నిర్మాణాలకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నట్లు కలెక్టర్ సి నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన యంగ్ ఇండియా - ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాల శంకుస్థాపన ఏర్పాట్ల పై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు,సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ మైనార్టీ వర్గాల విద్యార్థులకు, అన్ని సౌకర్యాలతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్న ఉద్దేశ్యం తో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా నేడు ఉదయం 10 గంటలకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్గొండ నియోజకవర్గానికి సంబంధించి నల్గొండ పట్టణం లోని గంధం వారి గూడెంలో, మునుగోడు నియోజకవర్గానికి సంబంధించి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు మండలం, కల్వకుంట్ల గ్రామం వద్ద శంకుస్థాపనలు చేయనున్నట్టు తెలిపారు.

పండుగల శంకుస్థాపనలు...

ఈ పాఠశాలల శంకుస్థాపన కార్యక్రమాలను పండగ వాతావరణంలో, ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించాలని చెప్పారు. ఎస్ సి , ఎస్ టి,బి సి ,మైనారిటీ రెసిడెన్సియల్ పాఠశాలలకు చెందిన తల్లిదండ్రులు, టీచర్లు,అంగన్ వాడి టీచర్లు,మహిళా సంఘాల ప్రతినిధులు హాజరయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.శంకుస్థాపనలు నిర్వహించే చోట డయాస్,స్టేజి,పబ్లిక్ అడ్రెస్ సిస్టం,తాగునీరు,ఎల్ ఈ డి స్క్రీన్ ల వంటి అన్ని ఏర్పాట్లు చేయాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ స్కూళ్ల నిర్మాణాలను రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించడం జరుగుతుందని ఆయన తెలిపారు.టేలి కాన్ఫెరెన్ లో అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర, ఆర్ అండ్ బి ఎస్ ఈ సత్యనారాయణ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా సద్దుల బతుకమ్మ పండుగ

నవతెలంగాణ-అర్వపల్లి



ప్రకృతిని పూజించే పండుగ ఆడబిడ్డలంతా ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ బతుకమ్మను ఎనిమిది రోజులుగా తీరొక్కపూలతో ఎంతో సంబురంగా జరుపుకున్న బతుకమ్మ వేడుకల్లో భాగంగా నేడు చివరి రోజున మండల కేంద్రంలో మండల పరిధిలో వివిధ గ్రామాల్లో సదుల బతుకమ్మ వేడుకను వైభవంగా నిర్వహించారు. గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు









ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-నేరేడుచర్ల

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరుపుకునే పండుగ బతుకమ్మ తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మగా గౌరమ్మని కొలుస్తారు. చివరి రోజు అత్యంత పెద్దదిగా తయారు చేసి ఆట పాటలతో సందడి చేశారు. బతుకమ్మ సంబరాలు మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో విజయ దుర్గ ఆలయంలో, విద్యనగర్ రామాలయం, రామాపురం రామాలయం, కమల నగర్ రామాలయం వద్దకు మహిళలు, చిన్నారులు సాంప్రదాయ పట్టుబట్టల వస్త్రధారణలో రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి డప్పు వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా విజయ దుర్గ ఆలయం వద్దకు తామెంతో ప్రేమగా పేర్చుకుని తీసుకుని వచ్చిన బతుకమ్మలను ఒకచోట చేర్చి బతుకమ్మ పాటల మధ్య కోలాటాలతో తెలంగాణ సంస్కృతి ఎంత గొప్పదో చూపరులకు ప్రస్ఫుటం చేసింది.కోలాటం నృత్యాల అనంతరం చెరువులో కుంటలలో తాము తీసుకొచ్చిన బతుకమ్మలను నిమజ్జనం చేశారు. సద్దుల బతుకమ్మతో తొమ్మిది రోజులపాటు వైభవంగా సాగిన బతుకమ్మ ఉత్సవాలు ముగిశాయి.